కథానిక

# సరికి సరి

ఆర్. యం. చిదంబరం

రామారావు ఆదరాబాదరాగా ఆఫీసు నుంచి వచ్చేసరికి అతనికి వినిపించినవి తన పెళ్ళి మాటలు.

"ఏమయినాసరే, ఆ సంబంధం వదలొద్దు. బంగారంలాంటి సంబంధం. చెంపకు చేరడేసి కళ్ళు, గుండ్రటి ముఖం, పిల్ల ముచ్చటగా ఉంది. మహాలక్ష్మి కోడలుగా వస్తోంది. ఇక వెంకట్రామయ్యగారి వంశ మర్యాదలనుగణించి అడగనక్ఖర్లేదు. అన్నివిధాలా ఉత్తమమైనది" అంటున్నది తల్లి. "సరేలే. నువ్వూ నేనూ నిర్ణయిస్తే సరిపోయిందా? అబ్బాయి రావాలి. పిల్లను చూచుకోవాలి. అప్పుడే పెళ్ళి ఖాయం చేయాలి" అని సమాధానమిచ్చాడు తండ్రి.

తల్లిదండ్రులకు కనిపించకుండా ఈ మాటలు విన్న రామారావు ఇంట్లో అడుగుపెట్టాడు.

"అబ్బాయి! వెంకట్రామయ్యగారి పిల్లను చూసొద్దామురా" అన్నది తల్లి. సరేనన్నట్లుగా రామారావు తల వూపాడు.

* * *

పెండ్లి చూపులకొచ్చినవారిని వెంకట్రామయ్యగారు సగౌరవంగా ఆహ్వానించారు. రామారావు కిదంతా అయిష్టమయినా తల్లిదండ్రుల ముచ్చటకోసం వచ్చాడు. పెండ్లిని యెరగా చూపి ఒక మహాసముద్రంలో పడేస్తున్నారన్న సంగతి అతని మెదడులో మెదలుతూనే ఉంది. కాని ఏం ప్రయోజనం?

పిచ్చాపాటీ మాట్లాడుకున్నారంతా. ఫలహారాలు, కాఫీలు ముగిశాక పెళ్ళికూతుర్ని తీసుకొచ్చారు. చదువులో, సంగీతంలో పరీక్షలు ముగిసాక వచ్చిన అతిథులు "తరువాత చెబుతామ"ని ఇంటిముఖం పట్టారు. "ఏరా! పిల్ల నచ్చిందా?" అనడిగింది తల్లి కొడుకును త్రోవలో.

అడ్డంగా తల వూపాడు కొడుకు. తల్లి ఆశ్చర్యపోయింది. ఏ లోటూలేని సంబంధాన్ని తిరగగొట్టటానికి కారణం? "ఇదేమిట్రా! సలక్షణమైన పిల్ల. రంభలావుంది. అడకువ అన్నీ ఉన్నాయి" అన్నది తల్లి.

"అంత అడకువగా ఉన్న పిల్లలంటే నా కిష్టంలేదమ్మా!"

"ఆడపిల్లకు కావలసింది అడకువే కదటరా?"

"కావచ్చు. కాని నాకు మరీ అడకువగా వున్న పిల్లలంటే నచ్చదు. అదీగాక ఆ అమ్మాయికి సంగీతం వచ్చును. నాకు సంగీతం గర్భశత్రువు."

రామారావుకు పిచ్చెక్కిందేమో ననుకుంది తల్లి.

"చదవేస్తే ఉన్నమతికూడా పోయింది" అని గొణుక్కుంది.

"ఈకాలపువాళ్ళంతా ఇంతే! మొన్న ఆ చంద్రరావుగారి అమ్మాయి వెంకన్న కొడుకును చేసుకోనందట. పిల్లాడు మన్మధుడిలా గుంటాడు సర్కిల్ చేస్తున్నాడు. ఇంతకంటె ఏం కావాలి? ఆ అమ్మాయికి మగడు, ఇరవైనాలుగు గంటలూ తనదగ్గరే ఉండాలని ఉందట. అందుకని ఉద్యోగాలు చేసేవాడిని కట్టుకోదట. జమీందారు కొడుకును చేసుకోటానికి చంద్రరావు శ్రీమంతుడు కాడుగా. ఈ సమస్య ఎలాగ పరిష్కారమవుతుంది? అలాగే ఈ వెధవకుకూడా తల తిరుగుతోంది" అని రామారావును గుడ్లువురిమి చూచాడు తండ్రి.

మరో సంబంధం. ఈ పిల్ల రామారావు ఊహలకు సరిపోయింది. పిల్ల స్వయంగానే వచ్చి రామారావు ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంది. ఎవరూ ప్రశ్నించకుండానే తను స్కూలుఫైనలు చదువుకుందని చెప్పుకుంది. తనకు సంగీతం రాదన్నది ఆపిల్ల. తల్లిదండ్రులు ఎంత యత్నించినా ఆమెనడకువలో ఉంచలేకపోయారు. అందుకే ఆ గర్భశ్రీమంతురాలైన

ఆ కన్యకు పద్దెనిమిదేళ్ళు వచ్చినా పెళ్ళి కాలేదు. ప్రతివారు పిల్లను చూడటానికి రావటం ఈ అమ్మాయి నడవడికి గుండె చెదరి గాథ రాయెత్తి ఆదేపనిగా వచ్చినత్రోవను వెనక్కు తిరిగిచూడకుండా పరుగెత్తటం జరుగుతోంది. ఈ పిల్లను చూడగానే రామారావు ముఖం చేటంతయింది.

"ఏరా! పిల్లనచ్చిందా?" అనడిగింది తల్లి త్రోవలో.

"ఇంతకంటె మంచిపిల్ల దొరకదు సంగీతం కూడా రాదు. ఇంతకంటె ఇంకేం కావాలి?" అన్నాడు సంతోష సాగరంలో మునిగి తేలుతూ రామారావు

"కట్నం ఏమాత్రం ఇస్తారండి" అనడిగింది తల్లి.

తండ్రికిముందే రామారావు తల్లి ప్రశ్నకు సమాధానం చెప్పాడు.

"కట్నం దమ్మిడీ అయినా పుచ్చుకోటానికి వీల్లేదు". అతని మాటల్లో ఒక ధృఢ నిశ్చయం తాండవిస్తోంది. తల్లిదండ్రు లిద్దరూ విస్తుపోయారు.

"నీకు పిచ్చెక్కిందా యేమిటి?" అనడిగింది తల్లి.

"వాళ్ళు కట్నం యివ్వలేనంత బీదవారు కారు. పొలుకు ముప్పైవేలు వస్తాయి. యాభై వేలు వడ్డీకి తిరుగుతున్నాయి. రెండు పెద్ద ఇళ్ళు. మనం బాధ పెట్టి కట్నం గుంజటంలేదు. తండ్రి సంతోషంతో కట్నం యిస్తాడు." తాను కట్నం అడగటం న్యాయమేనని నిరూపించాడు తండ్రి.

"అదంతా నాకు పనికిరాదు. నా అభిప్రాయ ప్రకారంగా నా పెళ్ళి నడవాలి. నేను కట్నాలు పుచ్చుకోకూడదని ఎన్నో సభలలో ఉపన్యసించాను. అనేకులను కార్యాచరణకు త్రిప్పాను. నా ఆశయాన్ని నాశనంచేసుకోమంటారా? ఈ దేశంలో ఏమగాడికీ కరుణ లేదు. ఎదుటి మానవుడు పడే కష్టాన్ని గ్రహించి జాలిచూపించి కట్నం అడుగకూడదన్న బుద్ధిలేదు. మీ కిష్టమయితేనే పెళ్ళి చేయండి" అని ఏకధాటిగా ఉపన్యాసం దంచాడు. తండ్రికి ఒక వైపు కోపం మరో వైపు చిరాకు ముంచుకొచ్చాయి.

"వాళ్ళు ఆస్తికలవారు. ఏమీ బాధపడటం లేదు. హాయిగా చిద్విలాసంగా ఉన్నారు. కట్నం పుచ్చుకుంటే అతనకేమీ బాధలేదు"

"అలా పనికిరాదు చిల్లిగవ్వయినా వాళ్ళు మన కివ్వనవసరంలేదు" అన్నాడు రామారావు సడలని నిశ్చయంతో.

"అయితే రంగయ్య కూతురిని చేసుకో. రంగయ్య డబ్బు లేనివాడు. కూతురు పెళ్ళిచేయలేక నానా యిబ్బంది పడుతున్నాడు ఆ అమ్మాయి కప్పుడే పద్దెనిమిదేళ్ళు పోనీ వాడి జీవితమన్నా కొంత మంచి పంథాలో సాగి పోతుంది. మనకు శాంతి దక్కుతుంది" అని సలహా యిచ్చింది తల్లి.

"నేను బీదింటిపిల్లను చేసుకోను" అన్నాడు ఏ మార్పూ లేకుండా రామారావు.

తల్లితండ్రులకు మతిపోయింది. పిచ్చి ఆసుపత్రిని గుర్తుకు తెచ్చుకున్నారు.

"అసలు నీ అభిప్రాయమేమిటిరా? కొంత వివరించి చెప్పు. ఇలాగ డొంక తిరుగుడుగా చెబుతావేం?" అనడిగాడు తండ్రి ఒళ్ళు మండి.

"నాకు కట్నాలు పుచ్చుకోటం ఇష్టంలేదు. అయితే బీదింటిపిల్లను చేసుకుని వాళ్ళ కుటుంబాలను బాగుచేయలేను. నేను ధనవంతుల బిడ్డను చేసుకోటం డబ్బుకోసం కాదు."

"మరి?" అనడిగాడు తండ్రి అయోమయంగా చూస్తూ.

"భార్యా భర్తలమధ్య తరచు కయ్యాలు రావటం సహజమేనా?"

"అవును."

"తగవులంటే నాకు గిట్టవు. ప్రణయకలహాలైనా సరే. అయినా కొంతవరకు సహిస్తాను. శృతిమించి రాగానపడితే పెళ్ళాన్ని పుట్టింటికి పంపేస్తా. అప్పుడామె తలిదండ్రులు బీదవాళ్ళయితే ఆమెకు తిండి పెట్టలేక బాధ పడతారు. ఆమెకు ద్రోహంచేసినవాడి నవుతాను. వారు శ్రీమంతులైతే ఏబాధా ఉండదు. అందుకే డబ్బున్నవాళ్ల పిల్లను పెళ్ళాడుతా నన్నాను" అని తేల్చాడు రామారావు.

తలిదండ్రులు మతిపోయి ఒకరిముఖా లొకరు చూచుకున్నారు.

రామారావు ఇష్టప్రకారంగానే వివాహం వైభవోపేతంగా జరిగింది. డబ్బున్న వాడి దగ్గరనుండి కట్నం పుచ్చుకోకపోవటం గురించి పలువురు పలువిధాల అనుకున్నారు. కొందరు రామారావు తండ్రిని పిచ్చివాడన్నారు. కొందరు "ఏదో యెత్తు వేస్తున్నా" డన్నారు.

నూతన దంపతులిద్దరూ ఆనందరసపూరితమైన పండు వెన్నెలవంటి నూతన దాంపత్య సుఖాలననుభవిస్తున్నారు. రామారావు మనసు సంతోషాతిరేకంతో గర్వంగా నాట్యం చేస్తోంది.

* * *

ఇంటి గుమ్మందగ్గర బండి ఆగటం కూతురు దిగిరావటం, ఇవన్నీ గమనించిన రామారావు మామ సోమనాథంగారు గాభరా యెత్తిపోయారు. కాపురానికిపోయిన ముద్దులపట్టి నెల తిరక్కముందే పుట్టింటికి తిరిగి రావటానికి కారణమాయన కంతుపట్టలేదు. ఏమయినా పండుగా పబ్బమా? ఏమీ లేదు. ఆమె ముఖంకేసి పరీక్షగా చూచారు కించిత్తు దుఃఖమయినా ఆ సుందర వదనంలో కనిపించలేదు. ఆమె పదహారణాల మందహాసం ఒలకబోస్తోంది. పెట్టె గిట్టె ఇంట్లో పడేసి బండివాడికి డబ్బులిచ్చేసి కుర్చీలో కూలబడింది వాసంతి. బండివాడు మాడిన పొట్టను చేత్తో పట్టుకుని ఎముకల గూడెం లాగున్న ఎద్దును కొరడాతో ఛెళ్ళున కొట్టాడు. అయిష్టంగా ఉన్నా కొరడా దెబ్బలకు పరుగు తీసింది ఎద్దు. తండ్రి కంతా అయోమయంగా ఉంది

"ఏమమ్మా! వచ్చేశావే? అల్లుడు రాలేదే?" అనడిగాడు గాభరాగా తండ్రి తల్లి కూడా ఈ మాటలు విని హాల్లోకి పరుగెత్తుకు వచ్చింది.

"అరె, వాసంతి! ఇదేమిటీ రాక!" ఆమె అలాగే నిలబడిపోయింది.

"అసలు సంగతేమిటి? గాభరా పెట్టేస్తున్నావు?" ఈసారి తండ్రి కంఠధ్వనిలో దుఃఖం కూడా మిళితమై ఉంది.

"అబ్బే! ఏమీలేదు. ఆయనతో కాపురం చేయటాని కిష్టంలేక వచ్చేశాను" అంది నవ్వుతూ.

తలిదండ్రుల ముఖాన కత్తివాటు వేసినా నెత్తురు చుక్కలేదు.

"అసలు కలహా కారణమేమిటి?"

"ఏమీ లేకపోతే వస్తానా?"

"ఏమిటీ వెధవ సమాధానాలు? ఉన్న సంగతి చెప్పు."

"మొన్న ఆయన్ని ఓ సాదా చీర కొని తెమ్మన్నా. ఎరుపు రంగుది. ఖరీదు పదిహేనుకు మించకూడదని పదేపదే చెప్పాను. కాని నా మాట యెవరికి లెక్క? సిల్కుచీర కొనుక్కొచ్చారు. అదీ ఎరుపు రంగుదే. నాకు నిజంగా వళ్ళు మండింది. నా మాటకు విలువ లేకుండా పోయింది. నాకు తల కొట్టేసినట్టయింది."

"అయ్యో, నీ తెలివి తగలెయ్య! ఆవేం పాడు బుద్ధి? మొగుడు సిల్కు చీర తెస్తే ముచ్చటగా వాడుకుంటారుగాని తుక్కు చీర తేలేదని పండంటి సంసారం పాడు చేసుకుంటారా? నువ్వెక్కడ దాపురించావే మాకు? మా ప్రాణాలు తింటున్నావు. నీకు పెళ్ళి చేసేసరికి మా తలప్రాణం తోకకు వచ్చింది." సోమనాథంగారి తల గిరగిర తిరుగుతోంది

"వెళ్ళు. బయలుదేరు. వెళ్ళి అతనితో చెప్పకుండా వచ్చినందుకు క్షమాపణ చెప్పుకో. జీవితంతో ఆటలాడుతున్నావా? నీ భవిష్యత్తు ఆలోచించావా? వెధవ వేషాలు వెయ్యకు. ముచ్చటగా సంసారం చెయి. ఊఁ బయలుదేరవేం?" అని గద్దించాడు తండ్రి.

"అటు సూర్యుడు ఇటు పొడిచినా ఇక నే నాయనతో కాపురం చేయను. నా కోర్కెను ఎందుకు త్రోసిపుచ్చాలి? నాకా పాటి స్వతంత్రం లేదా? అన్నిటికీ ఆయన పంతమే నెగ్గాలా?" అన్నది వాసంతి కోపంగా. ఇంకా ఏమేమో అంటోంది తల్లి తండ్రులకు ఆమె పట్టుదల, మనసు తెలుసు. వాళ్ల తలలు గిరగిరగిర తిరుగుతున్నాయి.

పెళ్ళయిన ఆడది చూపించగలిగే ప్రేమ అమితమాధుర్యమైనది. అయితే పెళ్ళి చేసుకున్న మగవాళ్ళకెవరికీ ఆప్రేమ లభించదు —ఆస్కార్ వైల్డ్.